# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రారంభించారు.
- రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను ఇవ్వనున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.
- భవన నిర్మాణాల కోసం కొత్త సాఫ్ట్ వేర్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.
- మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేకంగా 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేశామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- రాష్ట్రంలో 3 శాసనమండలి స్థానాల ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈరోజు కొనసాగుతోంది.

======================

ఆంధ్రప్రదేశ్ ను గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ప్రపంచ కేంద్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అందులో భాగంగా తిరుపతిలోని రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్‌లో మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ఉండవల్లిలో ఆయన నివాసం నుంచి ఈరోజు దృశ్యమాధ్యమ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్... పారిశ్రామిక అవసరాల కోసం పీఎన్జీ, ఎల్పీజీతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని అన్నారు. ఈ సాంకేతికత కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, భారతదేశ శక్తి పరివర్తనకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

======================

పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను ఇవ్వనున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రతి పేద వాడికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇళ్లు ఉండాలనేది ప్రభుత్వ విధానమని, అందులో భాగంగానే పేదలకు గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలం

ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. గత నెలలో ఇందుకు సంబంధించి జీవో ఇవ్వగా ఇప్పటి వరకు 70,238 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ధరకాస్తుదారులకు ప్రభుత్వ భూములు ఉన్న చోట కేటాయింపులు చేస్తామని, అంతేకాక ఇంటి నిర్మాణానికి 4 లక్షల రూపాయల ఆర్థిక సాహాయాన్ని అందిస్తామని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 18 సెకన్లు)

======================

భవన నిర్మాణదారుల కోసం కొత్త సాఫ్ట్ వేర్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభిద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈ రోజు అమరావతిలో మంత్రి మాట్లాడుతూ... 18 మీటర్ల లేదా ఐదు అంతస్తుల లోపు భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే టౌన్ ప్లానింగ్ అధికారులతో సంబంధం లేకుండా అనుమతులు లభిస్తాయని తెలిపారు. దీనికి సంబంధించి గత నెలలోనే కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ.. ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగిందని, భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త సాఫ్ట్ వేర్ ను APDPMS పోర్టల్ లోకి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ విధానం 1985 సంవత్సరానికి ముందు నిర్మించిన భవనాల పునర్మిణానానికి ఉపయోగపడుతుందని మంత్రి వెల్లడించారు.

======================

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేకంగా 'ఈగల్' వ్యవస్థను ఏర్పాటు చేశామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున 26 నార్కోటిక్ సెల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. గత 8 నెలల్లో 11 వేల ఎకరాలుగా ఉన్న గంజాయి సాగును 100 ఎకరాలకు నియంత్రించామని తెలిపారు. రాష్ట్రంలో  7 మండలాల్లోని 375 గ్రామాల్లో 20 హాట్ స్పాట్ లను గుర్తించి గంజాయి సాగు చేపట్టకుండా చేశామని హోంమంత్రి తెలియజేశారు. గంజాయి సాగుకు అలవాటుపడిన కుటుంబాలకు కౌన్సెలింగ్ చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహించామని మంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 34 సెకన్లు)

======================

రాష్ట్రంలో  3 శాసనమండలి స్థానాలకు ఇటీవల జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలోనూ, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఏలూరు సమీపంలోని సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోనూ, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ  ఓట్ల లెక్కింపు గుంటూరు ఏసీ కాలేజీలో జరుగుతోంది. ఈ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ఇంకా వెల్లడించాల్సి ఉంది.

విరామం

======================

అనంతపురం జిల్లాలో పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్న పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా వినికిడి పరికరాలు పంపిణీ చేస్తుందని రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం అధికారి డాక్టర్ నారాయణ స్వామి తెలిపారు. ఈరోజు ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో  ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "నేషనల్ హెల్త్ మిషన్" చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ శబ్ద కాలుష్యంను సాధ్యమైనంత వరకు తగ్గించాలని ఆయన కోరారు.

మరోవైపు పరిమితికి మించిన శబ్దాలు వినడం ద్వారా వినికిడి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక జీవన శైలిలో ప్రతీ ఒక్కరూ వినికిడి

సామర్థ్యానికి అవరోధం లేకుండా జాగ్రత్త పడాలని, ఒక స్థాయికి మించిన శబ్దాలు తరచుగా వినడం వల్ల మన చెవిలో వినికిడి వ్యవస్థ దెబ్బతిని క్రమేపీ వినగలిగే సామర్థ్యం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు.

=======================

రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి త్వరలోనే ప్రకటన విడుదల చేయనున్నామని విద్య శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈరోజు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.... "రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల ప్రహరీ గోడలను పూర్తి చేయాలంటే 3 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని, మన బడి-మన భవిష్యత్తు.. నినాదంతో ఉపాధి హామీ కింద దశల వారీగా వాటిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలల్లో 'ఈగల్' బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ఇచ్చిన స్టార్ రేటింగ్ ఆధారంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు వేస్తున్నామని మంత్రి నారా లోకేష్ వివరిస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

=======================

విజయనగరం జిల్లాలో ఎక్కడా తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో తాగు నీరు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై చేపట్టిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... మండలాల వారీగా గృహాలకు సరఫరా అవుతున్న తాగు నీటి పైప్ లైన్లను తనిఖీ చేయాలనీ అన్నారు. వచ్చే 3 నెలలు కీలకమని, ముందుగానే నీటి ప్రణాళికలను తయారు చేసుకోవాలని, తాగు నీటి వనరులపై పూర్తి సమాచారాన్ని కలిగి ఉండాలని తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కోసం నిధులు వచ్చే అవకాశం ఉందని, మొదలు పెట్టిన పనులన్నీ వచ్చే 3 వారాల్లో పూర్తి చేయాలనీ అన్నారు. వంద రోజులు పని కల్పన ప్రస్తుతం 30 శాతం ఉందని, కనీసం 70 శాతానికి చేరాలని తెలిపారు.

=======================

మాజీ లోక్‌సభ మాజీ స్పీకర్, దివంగత జిఎంసి బాలయోగి కోనసీమ అభివృద్ధికి నిరంతరం కృషి చేసే వారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. అమలాపురంలో ఈరోజు జరిగిన జిఎంసి బాలయోగి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... చుట్టూ గోదావరి నదీ పాయలతో ఉండే కోనసీమకు రహదారి మార్గాలు, వంతెనల ఏర్పాట్లుకు బాలయోగి ఎనలేని కృషి చేశారన్నారు. కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు కూడా ఆయనే శ్రీకారం చుట్టారని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తుందన్నారు.

=======================

పార్వతీపురం మన్యం జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వచ్చే పెట్టుబడిదారులను స్వాగతిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రిసార్ట్స్, బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, లోటస్ గార్డెన్ వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు కావలసిన అన్ని మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. ముందుగా పెట్టుబడిదారులు పర్యాటక శాఖతో ఒప్పందం చేసుకొని, పర్యాటక శాఖ ద్వారా తమకు నివేదికను అందజేస్తే, వాటిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు జిల్లాలో కావలసిన ప్రభుత్వ స్థలాన్ని సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలో తోటపల్లి, వెంగళరాయసాగరం, పెద్దగెడ్డ వంటి రిజర్వాయర్లు ఉన్నాయని ఆయా ప్రాంతాల వద్ద బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటివి ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. తోటపల్లిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

=======================
=======================